# పచ్చని ఆకులు రెండు...

"మరో మాట మాట్లాడావంటే పళ్ళు రాలగొడతాను..."

అన్నది ఎనభై సంవత్సరాల మంగపతి.

అనిపించుకున్నది డెభై అయిదు సంవత్సరాల ఆయన భార్య దమయంతి.

సరిగ్గా అప్పుడు పక్క భాగంలో వున్న రోజీ మాక్సీ తీసేసి, జీన్స్ ప్యాంట్ వేసుకుంటున్నది. ఆ తరువాత దానిమీద టీ షర్టు వేసుకున్నది. డియోడెరెంట్ తీసుకొని చొక్కా మీద స్ప్రే చేసుకున్నది. కురచగా కత్తిరించుకున్న జుట్టును పైకి నెట్టుకుని డ్రెస్సింగ్ టేబుల్ మీద వున్న దువ్వెనను తీసుకొని దువ్వుకున్నది. టీ షర్ట్ రంగులో వున్న, కనబడీ కనబడనంత స్టిక్కర్‌ను తీసుకొని నుదుట పెట్టుకున్నది. చెవులకు చేతిగాజులంత స్టీలు రింగులు పెట్టుకున్నది. అద్దంలో తనని తాను చూసుకుంటూ తృప్తిగా తల ఎగరవేసుకున్నది- అందంలో తనకెవ్వరూ సాటిరారు అన్నట్లుగా.

ఆమె అలంకరణ చేసుకుంటూనే పక్క భాగంలోనుంచి వినబడుతున్న ఇంటి యజమాని అరుపులు వింటున్నది. ఆ మాటల తీరు ఆమెకు తిక్కరేగిస్తోంది. ఎంత పెళ్ళామయినా ఎందుకా నోటి దురుసుతనమో అర్థం కాదు. తను వెళ్ళి ముసలామెకు క్లాసు పీకక తప్పదు. మగవాడి దౌర్జన్యాన్ని తను చూస్తూ ఊరుకోలేదు. ఏం చూసుకొని అతడి ఆ అహం?

కాలింగ్ బెల్ మ్రోగితే వెళ్ళి తలుపు తీసింది. ఎదురుగ్గా సుధీర్. "హాయ్!"

"నేను రెడీ!" అన్నది భుజం మీద చేయివేసి అతడి ముఖంలో ముఖంపెట్టి చూస్తూ.

"సారీరా, రోజీ!" అన్నాడు ఆమెను దగ్గరకు తీసుకుంటూ అనునయంగా.

"ఏమైందిరా?" అడిగింది అతడిని కరుచుకుపోతూ.

"అమెరికా తిరిగి వెళుతూ రాజు మధ్యాహ్నమే గుంటూరునుంచి వచ్చాడు... ఫ్లయిట్ తెల్లవారుజామున రెండు గంటలకు... హైదరాబాద్‌లో వున్న మిత్రులంతా ఈ రాత్రి

వాడితో గడిపి, పన్నెండు గంటలకు ఎయిర్ పోర్ట్‌లో సెండాఫ్ ఇవ్వాలి అని ప్లాన్ వేశారు... సారీరా నిన్ను డిజపాయింట్ చేస్తున్నాను!"

తలెత్తి ఆ మాటలు చెబుతున్న భర్త ముఖంలోకి అయోమయంగా చూసింది. బిత్తరపోయి చూసింది. అతడు చెప్పింది అర్థమయ్యేటప్పటికి ఆమె ఒళ్ళు కోపంతో ఊగిపోయింది.

తీక్షణంగా చూస్తూ, కాస్త దూరం జరిగి అతడి గుండెలమీద గుప్పిటతో కొడుతూ, "ఐ హేట్ యూ!" అన్నది. "రాజులూ రాజులూ అంతా ఒక్కటే... ఇంట్లో రాణీలు ఏమైనా ఫరవాలేదు... వాళ్ళకిచ్చిన మాటలు ఎంత తేలిగ్గానయినా కొట్టిపారవేయవచ్చు... ఇవ్వాళ నా పుట్టిన రోజని తెలిసీ ఆ రాజుగాడితో తిరుగుతానంటే, తాగి తందనాలాడటానికేనా... నేనూరుకోను!" అన్నది ముఖమంతా ఎర్రగా చేసుకొని.

"అయిదేళ్ళ తరువాత వచ్చిన వాడు వెళుతుంటే సెండాఫ్ ఇవ్వకపోతే ఏం బాగుంటుందిరా... మళ్ళా మన దేశానికి ఎన్నాళ్ళకు వస్తాడో! నీ పుట్టినరోజు ప్రతి సంవత్సరం వచ్చేదే!" ఆమెను అనునయిస్తున్నట్లుగా అన్నాడు.

"నెల రోజుల క్రితం ఆయనగారు వచ్చినప్పుడు ఏడ్చారుగదా రెండు రోజులు బార్లలో పడి... ఇవ్వాళ మళ్ళా వెళ్ళక పోతే ఏమైంది మన ప్రోగ్రాం వదిలేసుకొని... మనం అనుకున్నదేమిటి... పబ్‌కు వెళ్ళాలి... అక్కడ హాయిగా గడిపేసి ఇంటికొచ్చి మేడమీద వెన్నెల్లో ఎంజాయ్ చేయాలని!" రోజీ అరుస్తునే వున్నది, సుధీర్ తువ్వాల కట్టుకొని బాత్‌రూంలోకి వెళ్ళిపోయాడు.

ఆమెకు కోపం నషాళానికి అంటింది. జుట్టు రేపేసుకున్నది కసిగా. టీషర్ట్ విప్పేసి, జీన్స్ ప్యాంట్ తీసేసి మ్యాక్సీ వేసుకున్నది. డబుల్ కాట్ మంచంమీద గోడ వైపుకు తిరిగి కళ్ళు మూసుకు పడుకున్నది.

సుధీర్ బయటకు వెళుతూ ఒకసారి తట్టి, "ఓకేరా రోజీ!... నాతో పాటు వచ్చేస్తే... నువ్వు ఏదైనా హోటల్లో డిన్నర్ తీసుకున్నదాకా వుండి, నేను అటు వెళతాను... నువ్వు ఇంటికి వచ్చేద్దువుగాని... ఓకే!" అన్నాడు సుధీర్.

"నో... నో... గెటౌట్... నా చావేదో నేను చస్తాను!" విసురుగా అని దుప్పటి బిగించేసింది.

'ఇంకో గంట పోవాలి నీ వేడి తగ్గాలంటే!' అనుకుంటూ గూడలెగరేసి, తలుపును దగ్గరకు లాగి బయటకు వెళ్ళిపోయాడు. తరువాత రెండు నిముషాల్లోనే కారు బయల్దేరుతున్న శబ్దమవ్వటంతో మరింతగా భగ్గుమన్నది రోజీ.

ఆమెకు ఒళ్ళంతా కసి... తన పుట్టిన రోజునాడు తనని భర్త నిర్లక్ష్యం చేయటం భరించలేకపోతోంది. అందునా అతనంటే ఎంతో ఇష్టపడి, తన వాళ్ళనందరినీ కాదని, ఆరునెలల క్రితం పెళ్ళి చేసుకొని, అతడే సర్వస్వం అనుకుంటూ వచ్చేసిన తన్ను, ఎవడో బోడి రాజు కోసం నిర్లక్ష్యం చేయటం జీర్ణించుకోలేకపోతున్నది.

ఆ మంచం మీదే ఓ అరగంట అటూ ఇటూ అసహనంగా దొర్లింది. తరువాత ఓ నిర్ణయానికి వచ్చిన దానిలా లేచింది. మ్యాక్సీ తీసేసి, మళ్ళా జీన్స్ ప్యాంట్ వేసుకుంది. టీ షర్ట్ వేసుకుంది. తలను పైపైనే దువ్వుకొని బయటకు వస్తుండగా, మంగపతి మాటలు వినబడినయి.

"నాకూ ఉన్నదండీ ఓ బోడి పెళ్ళాం... కదలదు, మెదలదు... చలిమిడి ముద్దలాగా ఓ మూల కూర్చునే వుంటుంది ఎప్పుడూ!"

రోజీ ఆ భాగంలోకి కాలుపెట్టబోయి నిభాయించుకుంది. 'ఇప్పుడు కాదు... తన మూడ్ అసలే బాగోలేదు. రేపెప్పుడయినా ఈ ముసలాడి అంతుచూడాలి.' అనుకుంటూ బయటకు వచ్చేసి, తన స్కూటీ బయటకు తీసి, దాని మీద ఎక్కికూర్చుంటూనే రంయ్‌న ముందుకు దూకించింది.

తరువాత పావుగంటకే తాజ్ కృష్ణాముందు ఆపి, స్కూటీని పార్క్‌చేసి విసురుగా లోపలకు వెళ్ళింది.

టేబుల్స్ అన్నీ ఫుల్‌గా వున్నయి. ఓ పక్కగా వున్న టేబుల్ దగ్గర ఒక్కరే వున్నారు.

సరాసరి అక్కడకు వెళ్ళి అతడికి ఎదురుగ్గా వున్న కుర్చీలో కూర్చుంటూనే ఆశ్చర్యంగా అతడి వంక చూసింది. అతడు శశాంక్! తన కొలీగ్...

"హాయ్!" అన్నది చేయిజాస్తూ, సుధీర్ మీద కసి ఒళ్ళంతా ఆవరించగా.

"అరే! సర్‌ప్రయిజ్..." అన్నాడు లేచ్చినిలబడి సంతోషంతో ఊగిపోతూ, చేయిజాచి శశాంక్.

అతడి ఆనందానికి అంతే లేదు. ఆమె అందాన్ని చూస్తే అతడికి పిచ్చెక్కిపోతుంది. ఎన్నోసార్లు దగ్గరవ్వాలని చూచినా అడుగు దూరంలోనే వుంచి మాట్లాడే రోజీ, దగ్గరకల్లా వచ్చి, చేయి జాపల్లా పలకరించింద్ అంటే అతడి ఒళ్ళంతా పులకరించిపోయింది. అటూ ఇటూ చూశాడు సుధీర్ ఎక్కడయినా కనబడతాడేమోనని.

"నీ హబ్బీ ఎక్కడ?"

"అమెరికా వెళుతున్న ఎవరో ఫ్రెండ్‌కు సెండాఫ్ ఇవ్వటానికి ఎయిర్‌పోర్ట్‌కు వెళ్ళాడు... ఇంట్లో ఒంటరిగా బోరుకొడుతుంటే ఇలా వచ్చాను!"

"నువ్వూ వెళ్ళి వుండవలసింది!" వెళ్ళకుండా ఎంత మంచి పనిచేసిందో ఊహించుకుంటూ అన్నాడు.

"నాకు అలాంటివి పరమ బోర్... అందుకే రాను పొమ్మన్నాను!" అన్నది విసుగ్గా.

అంటే కాస్త కోపంలో గూడా వున్నదన్నమాట. "నిజమే... నాకూ ఈ అర్ధరాత్రిపూట సెండాఫ్‌లంటే పరమ అసహ్యం... చాలా దగ్గర వాళ్ళయిన మా కజినూ, అతడి భార్యా వెళుతుంటేనే నేను వెళ్ళలేదు... ఇంటి దగ్గరే బై చెప్పేశాను... అక్కడా చివరకు మనం చెప్పేది అదేగదా!" కావాలనే అన్నాడు.

"నీ డిన్నర్ అయిందా?" అడిగింది రోజీ శశాంక్‌ని.

"అదృష్టం తలుపు తడుతున్నప్పుడు డిన్నర్ అంత తొందరగా ఎలా అవుతుంది... ఈరోజు నీతో చేయాలని భగవంతుడు రాసిపెట్టాడు... అందుకే ఇక్కడ జేరాను... థాంక్యూ ఫర్ యువర్ కంపెనీ!" అంటూనే బేరర్ వైపు చూసి, "మరో డిన్నర్!" అన్నాడు ఉత్సాహంగా. "ఎనీ స్పెషల్స్ యూ వాంట్!" ఓరగా ఒకసారి రోజీ వంక చూశాడు.

"నో... నీకేది చెబితే నాకూ అదే చెప్పు!" అన్నది ముభావంగా.

అతడికి అర్థమయింది ఆమె సుధీర్‌తో గొడవపడి వచ్చిందని. ఈ అవకాశాన్ని తను సద్వినియోగం చేసుకోవాలి!

"ఒక్కటి రోజీ! పక్కన కంపెనీ లేకుండా ఒంటరిగా ఇలాంటి చోటకు రావటమంటేనే మహా చికాకు... కాని ఏం చేస్తాను... నాకో పార్టనర్ దొరికేంతవరకూ తప్పదు కదా మరి... కాదూ గూడదూ అని నీలాంటి ఫ్రెండ్స్‌ని ఎవరినైనా కంపెనీ ఇస్తావా అని అడిగితే... రోజులెలా వున్నయ్... చెంపలు వాయిస్తారేమోనని భయం!" అన్నాడు చిన్నగా నవ్వుతూ.

రోజీ కూడా అతడి మాటలకు నవ్వింది. అతడి ఎదురుగ్గా కూర్చొని, అతడి సరదా మాటలు వింటుంటే మనస్సుకు కాస్త హాయిగానే వున్నట్లనిపిస్తోంది. శశాంక్ స్మార్ట్‌గా వుంటాడు. తనని పెళ్ళి చేసుకోమని సంవత్సరం క్రితం ఫీలర్స్‌ని పంపించాడు. కానీ, అప్పటికే తను సుధీర్ ప్రేమలో నిండా మునిగి పోయి వున్నది. అందుకే తనూ, సుధీర్ త్వరలో వివాహం చేసుకోబోతున్నామనే విషయాన్ని వాళ్ళ ద్వారానే అతడికి చెప్పించింది.

"పోనీ పెళ్ళి చేసుకోరాదు శుభ్రంగా!" రోజీ కళ్ళు చికిలించి అతడినే చూస్తూ అన్నది.

"సుధీర్‌కు నువ్వు దొరికినట్లుగా నాకూ ఎవరన్నా దొరకాలి గదా!" అన్నాడు కాస్తంత కొంటెగా.

"పోనీయ్ నేనే వచ్చేస్తాను చేసుకుంటావేమిటి... నీ బ్రహ్మచర్యం చూస్తుంటే నాకు జాలివేస్తోంది!" అన్నది కవ్విస్తున్నట్లుగా.

అతడు చటుక్కున లేచి నిలబడ్డాడు. "నా ఫ్రెండ్సందరికీ ఫోన్లుచేసి డిన్నర్‌కు ఇప్పుడే ఇక్కడకు వచ్చేయమంటాను!" అన్నాడు అతడూ చాలా హుషారుగా.

"కూర్చోవయ్యా బాబూ! ఏదో సరదాగా అన్నాను గాని... నీకెవరినైనా పిల్లను చూస్తాలే... త్వరగా పెళ్ళి చేసుకుందువుగాని!" అన్నది అతడి చేతిమీద తడుతూ.

"నేనూ సరదాగానే అన్నాలే!" అన్నాడు అతడూ కోలుకుంటూ. "నువ్వన్నమాట సుధీర్ వింటే నాకు ఇక రోజులు మూడినట్లే!" ఫక్కున నవ్వాడు.

బేరర్ వచ్చాడు ప్లేట్లు పట్టుకొని.

మసక వెలుగు. టేబుల్స్ దగ్గర గుసగుస మాటలు. ఏసీ చల్లదనంలో సన్నని మ్యూజిక్కు.

నిజమే తనకేమిటి తక్కువ... అందానికి అందమున్నది... నెలకు అరవై వేల జీతమున్నది... కో అంటే సుధీర్ లాంటి వాళ్ళు కోటిమంది తన కోసం పరుగెత్తుకుంటూ వస్తారు... వాడెవడో చిన్ననాటి స్నేహితుడట, ఆయనగారికి ఈయనగారు, వెళ్ళి అర్ధరాత్రప్పుడు సెండాఫ్ ఇవ్వాలట.... మామూలు రోజునయితే తను పట్టించుకునేది కాదు... తన వాళ్ళనందరినీ ఎగర్తించి, ఇంట్లోనుంచి వచ్చేసి, సుధీర్‌ను పెళ్ళి చేసుకున్న తరువాత వచ్చిన మొదటి పుట్టిన రోజు ఇది... వాళ్ళందరినీ ఈయనలోనే చూసుకుంటూ ఎంతో ఘనంగా జరుపుకోవాలి అనుకున్నది... అటువంటిది తనని ఒంటరిగా వదిలేసి ఆ వెళ్ళటమేమిటి- బుద్ధుండి చేసే పనులేనా ఇవి... మనస్సు కుతకుతలాడిపోతున్నది తనకు జరిగిన అవమానానికి...

"ఎలా వున్నది జీవితం?... బెండకాయ ఫ్రై చాలా బాగున్నది... ఇంకాస్త వేసుకుంటావా!"

"ఫైన్! చాలు... ఇంకా చాలా వెరైటీస్ వున్నయి... నా పొట్ట చాలా చిన్నది!"

అతడు నవ్వుతూ తన ఎడం చేత్తో ఆమె కుడిచేతి మీద తట్టాడు. "నడుము సన్నగా వుంటేనే బాగుంటుంది... పొట్ట బానలా వుందనుకో... చూసినవాళ్ళు 'హలో బామ్మగారూ ఎలా ఉన్నారు' అంటారు!"

ఆమె తన చేతిని వెనక్కు తీసుకుంటూనే, నోటికి అడ్డుగా పెట్టుకొని, "గుడ్ జోక్!" అన్నది.

శశాంక్ రోజీనే చూస్తూ భోజనం చేస్తున్నాడు.

"నేను అమెరికా వెళ్ళిపోదామా అని ఆలోచిస్తున్నాను... వీళ్ళు టెన్ లాక్స్ ఇస్తున్నారన్నమాట వాస్తవమేగాని, నాకు లైఫ్ కనబడటం లేదు... మా నాన్నకు ఒక్కడినే కొడుకుని... అయిదారు కోట్ల ఆస్తి వున్నది... ఇంత వుండి ఏం లాభం... జీవితానికి వెలుగు లేకుండా!" అతడి కళ్లు ఆమె మీద కాంక్షతో చురకత్తులే అవుతున్నాయి.

"అక్కడకు వెళ్ళినవాళ్ళే తిరిగి వచ్చేస్తున్నారు... నువ్వెళ్ళి ఏం చేస్తావ్!"

"అక్కడయినా నాకు నచ్చిన పార్టనర్ దొరుకుతుందేమో వెతుక్కుందామని!" క్షణం ఆలస్యం చేయకుండా అన్నాడు. ఆమె అతడి చూపుల్ని పట్టించుకోకపోయినా, అతడి మాటల్ని అర్థం చేసుకున్నది.

"శశాంక్ ఒక్కటి గుర్తుంచుకో... మనం ఏం ఎంజాయ్ చేసినా ఈ వయస్సులోనే... త్వరగా నీకు నచ్చిన ఓ అమ్మాయిని చూసి చేసేసుకో... కులాలు, గోత్రాలు అంటూ పట్టింపులు పెట్టుకోబోకు... లైఫ్‌ను ఎంజాయ్ చేయటమే మన ధ్యేయం కావాలి... జీవితం బాగుంటుందని ఓ పార్ట్‌నర్‌ని చూసుకుంటాం... బాగుందా, ఓకే... లేదా...వర్రీ అవ్వాల్సిందేం వున్నది... డైవర్స్ తీసుకోవటం, ఫ్రెష్‌గా జీవితాన్ని ప్రారంభించటం... ఏమంటావ్!"

"నాదీ అదే ఆలోచన... అసలు నిన్ను నేను మిస్ అవ్వటమే నా దురదృష్టం!" అన్నాడు తలవంచుకొని దిగులుగా.

"ఓకే... పాస్ట్ యీజ్ పాస్ట్... నువ్వంటే నాకు చాలా సింపతీ... కాని నీ మనస్సులోని ఉద్దేశ్యం నాకు తెలిసేటప్పటికే ఆలస్యమయిపోయింది!" అన్నది అపాలజటిక్‌గా రోజీ.

భోజనాలయ్యేటప్పటికి తొమ్మిది దాటింది. బిల్లు నేనిస్తానంటే నేనిస్తానని పోటీ పడ్డారు.

శశాంక్ ఆమె చేతులు గట్టిగా పట్టుకొని, "ప్లీజ్... నన్ను ఇవ్వనివ్వు... నాకు తృప్తిగా వుంటుంది!" అన్నాడు.

లేచారు ఇద్దరూ. శశాంక్‌కు అయితే రోజీని వదిలి వెళ్ళిపోవాలనుకోవటం స్వర్గంనుంచి క్రిందకు పడిపోతున్నట్లుగానే అనిపిస్తోంది...

బయటకు వచ్చింతరువాత తన బండి దగ్గరకు వెళుతూ, "గుర్తు పెట్టుకో రోజీ! ఎక్కడయినా సరే నీలాంటి అమ్మాయి దొరుకుతుందేమో చూడు... కాదూ... ఈరోజున నా మనస్సులోని మాట చెబుతున్నాను... నువ్వు ఓకే అన్నా నాకు ఆనందమే!"

రోజీ నవ్వేసి 'బై' అంది. అతడు వెళ్ళిపోయాడు.

ఆమె స్కూటీ ఎక్కింది. ఇంటికి వెళ్ళాలంటే ఉత్సాహంగా లేదు. తను నమ్మిన మగవాడి చేతిలో ఓడిపోయి, పరాభవం చెందినట్లుగా దిగులుగా వున్నది. తన పుట్టినరోజు నాడు ఆనందంగా గడిపేయాలనుకున్న అతి చిన్న కోరిక కూడా అందని ద్రాక్ష పండే అయింది. తన ఆనందం మీద నీళ్ళు కుమ్మరించాడు సుధీర్.

'ఐ హావ్ టు టీచ్ హిమ్ ఎ లెసన్!'.

✣ ✣ ✣

తెల్లవారిం తరువాత ఏడుగంటలకు సుధీర్ ఇంటికి వచ్చాడు.

"సారీరా రోజీ! ఫ్లయిట్ త్రీ అవర్స్ లేట్... మేం ఎయిర్ పోర్ట్‌నుంచి బయటపడి సిటీలో ఎంటరయ్యేటప్పటికే రెండు గంటలయింది...ఇప్పుడేం ఇంటికి వెళతావ్... మా ఇంటికి వెళ్దాం రమ్మనమని రాజేంద్రనగర్‌లో వున్న వాళ్ళింటికి తీసుకు వెళ్ళాడు జయరాం... అందునా అప్పుడొచ్చి నిన్ను డిస్టర్బ్ చేయటం ఇష్టం లేకపోయింది... సారీరా, వెరీ సారీ... బోర్ ఫీలయివుంటావ్... అసలు భోజనం చేశావా?"

"నేనేం బోర్ ఫీల్ కాలేదు... శశాంక్‌కు ఫోను చేసి కంపెనీ ఇస్తావా అని అడిగాను... తాజ్‌కృష్ణాలో డిన్నర్ ఇచ్చాడు... కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నాం... ఇంటికి వచ్చేటప్పటికి పది దాటింది... నీకు తెలుసుగదా... అతడు చాలా సరదా మనిషి... నేనంటే ప్రాణం ఇస్తాడు!" అన్నది ఓరగా సుధీర్ ముఖంలోకి చూస్తూ.

సుధీర్ విసురుగా ముందుకు వచ్చాడు. "వాడితో నీకేం పని... వాడు తప్ప నీకు కంపెనీ ఇచ్చేవాడే దొరకలేదా... వాడు వట్టి వెధవ అని ఈ ప్రపంచంలో నాకే కాదు అందరికీ తెలుసు!" అన్నాడు విసురుగా.

"ఏ వెధవయితేనేం... నా పుట్టిన రోజునాడు నేను ఎంజాయ్ చేసేలాగా నాకు కంపెనీ ఇచ్చాడు!" అన్నది మరింత నిర్లక్ష్యంగా- ఇప్పుడే బాగా వాతలు పెట్టాలి, ఇంకోసారి ఇలా జరక్కుండా అనుకున్నది మనస్సులో.

"అంటే పుట్టిన రోజు అని పేరు పెట్టుకొని ఎవడితోబడితే వాడితో తిరగటమేనా... బుద్ధీ, జ్ఞానం వుండే మాట్లాడుతున్నావా... నలుగురూ చూసి ఏమనుకుంటారు... మన పరువేం కావాలి!"

"సుధీర్! పిచ్చిగా మాట్లాడబోకు... రెండు గంటలపాటూ మరో మగవాడితో గడిపితేనే మన పరువు పోతుందీ అనుకుంటే నువ్వెంత వెనుకబాటులో వున్నావో గుర్తుంచుకో... స్నేహితులతో తాగి తందనాలాడితే మన పరువు పెరుగుతుందా ఏం?... పెళ్ళాం పుట్టిన రోజు నాడు ఒంటరిగా ఆమెను ఇంట్లో వదిలేసి బార్లమ్మట తిరగటానికి వెళితే ఎవరూ ఏమీ అనుకోరా... నీలాంటివాడు కాదు శశాంక్! ఇంకో మాట కూడా అన్నాడు... నేను సరే అంటే తను ఇప్పటికీ నన్ను పెళ్ళి చేసుకునేందుకు రెడీగా వున్నాడట... కోటీశ్వరుడు... అతడుగానీ, అతడి కాబోయే పెళ్ళాం కానీ, ఉద్యోగం చేయాల్సిన అవసరమే లేదు... ఇరవైనాలుగు గంటలూ వాళ్ళకిష్టమొచ్చిన రీతిలో జీవితాన్ని వాళ్ళ కిష్టమయిన చోట ఎంజాయ్ చేయవచ్చు!" సుధీర్ ముఖంలోకే చూస్తూ కసిగా అన్నది.

రోజీ మాటల్ని అతడు భరించలేకపోయాడు... రాజు మళ్ళీ ఎప్పటికి వస్తాడో.... తనకు మరోసారి జీవితంలో కనబడతాడో లేదో... అటువంటి స్నేహితుడితో గడపటానికి వెళితే, ఆ కోపంతో ఓ వెధవను వెంటేసుకొని ఇది బలాదూరు తిరుగుతుందా... అంత బరితెగింపా? అందమూ, సంపాదనా వున్నదని అహంకారమా? దాని స్థానమేమిటో దానికి చూపించాలి... ముందు ముందు బుద్ధిగా వుండాలీ అనుకుంటే తను గట్టిగా డోస్ ఇవ్వక తప్పదు అనుకున్నాడు సుధీర్.

విసురుగా వెనక్కు తిరిగాడు, "ఓకే... నేను వెళుతున్నాను... నువ్వు శశాంక్‌ను పెళ్ళి చేసుకోవాలనుకుంటే నాకేం అభ్యంతరం లేదు... హాయిగా చేసేసుకో... విడాకుల కాగితాలు తయారు చేయించి పంపు, సంతకాలు పెడతాను!" బయటకు వెళ్ళిపోయి కారెక్కి డోర్ గట్టిగా పెద్ద శబ్దమయ్యేలా మూశాడు.

రోజీ ముసిముసి నవ్వులతో వెనక్కు తిరిగింది. 'పో! నన్నొదిలి నువ్వెక్కడికి వెళతావ్... గంటలో తయారవ్వవ్... రోజీ, రోజీ అంటూ!' అనుకున్నది, తనని తాను డ్రెస్సింగ్ టేబుల్‌కున్న అద్దంలో చూచుకుంటూ...

✣ ✣ ✣

రోజీ ఏదో పాటను హమ్‌చేస్తూ ఆఫీసుకు వెళ్ళేందుకు తయారవుతూ ఇవతలకు వస్తుండగానే ఇంటి ముసలాయన పెద్దగా కేకలేసుకుంటూ, గేటు తీసుకొని రోడ్డు మీదకు వెళ్ళాడు.

రోజీ వెళుతున్న ఆయన వంక అసహనంగా చూసి ఇంటి యజమానుల భాగంలోకి వెళ్ళింది. తను సుధీర్‌కు ఇచ్చిన డోసుకు మురిసిపోతూ హుషారుగా, "ఆంటీ!" అన్నది పెద్దగా.

"రా అమ్మా!... ఏంటి తీరిగ్గా వున్నావ్... ఆఫీసుకు వెళ్ళటం లేదా?" అన్నది చీర చెంగుకు తడిచేయి తుడుచుకుంటూ దమయంతి.

"మీరు ఎలా భరిస్తున్నారోగాని మీ ఆయన్ను... సుధీర్ గనుక ఇలా మాట్లాడితేనా విడాకులిచ్చి వెళ్ళిపోయేదాన్ని నేను!" అన్నది గంయ్‌మంటూ. "ఏమిటా దూకుడు... మాటకు ముందు పళ్ళు రాలగొడతానంటాడు అంకుల్!" అంటూ- ఎంత బాధపడే వాళ్ళకయినా చిన్న ఓదార్పు ఎంతో తృప్తినిస్తుంది- అనుకున్నది రోజీ.

దమయంతి పకపకా నవ్వింది. "రా... కూర్చో!" అంటూ కుర్చీ లాగింది.

"మీరు మెత్తగా వుంటే లాభంలేదు ఆంటీ! వీళ్ళు ఇలాగే పెట్రేగి పోతుంటారు! మీరు జీవితంలో చదువుకోక పోవటమే మీరు చేసిన ప్రథమ తప్పిదం!" అన్నది కుర్చీని బర్రున లాక్కొని కూర్చుంటూ.

దమయంతి మరోసారి నవ్వింది. "పందొమ్మిది వందల నలభై ఏడు... మనకు స్వాతంత్ర్యం వచ్చిన సంవత్సరమే... నేను ఎస్సెస్సెల్సీ పాసయ్యానమ్మా... తరువాత నాలుగయిదు సంవత్సరాలకే బి.ఎ పట్టా పుచ్చుకున్నాను... అప్పుడు మా ఊరి మొత్తం మీద నేనొక్కదాన్నే గ్రాడ్యుయేట్‌ని... ఇక మగవాళ్ళ అరుపులంటావా... మా ఆయన నన్నెప్పుడూ అరవడే... ఆయన తత్వమే అంత... కాస్త నోరు పెద్దది... మీరింకా పిల్లలు... అసలు మీలో మెచ్యూరిటీ ఏది... మీవన్నీ కాగితాల పెళ్ళిళ్ళు కాబట్టే మళ్ళా అంత తేలిగ్గా కాగితాలమీద సంతకాలు పెట్టేసుకొని విడిపోవాలనుకుంటారు... కాని మా బంధం వేరు... సంప్రదాయంగా జరిగిన వివాహంలో ఎన్నో ప్రమాణాలు చేసుకున్నాం... వాటి విలువేమిటో మీకేం తెలుస్తుంది!" అన్నది రోజీవంకే చూస్తూ చిరునవ్వుతో.

రోజీ ఆమె మాటల్నే వింటూ నోరు తెరుచుకు చూస్తుండి పోయింది...

"పెళ్ళిలో పురోహితుడు చెబుతాడే 'ధర్మేచ, అర్థేచ, కామేచ...' అంటూ. దాని అర్థం నీకు తెలుసా... ధర్మములందునూ, అర్థములందునూ, కామాదులందునూ

ఒకరినొకరు అనుసరిస్తూ గృహస్థాశ్రమ ధర్మాలనన్నిటిని ఆచరిస్తామని... ఆపైన 'మాంగల్యం తంతునానేన...' అనే మంత్రాన్ని పఠిస్తారు మంగళ సూత్రధారణప్పుడు... అంటే నా జీవిత గమనానికి కారణమైన ఈ మంగళసూత్రాన్ని నీ కంఠము నందు ధరింప జేస్తున్నాను, అది వంద సంవత్సరాలు అక్కడే వుండాలనే కోరికతో అనేకదా... అందుకే భార్యాభర్తల అనుబంధం విడదీయరాని బంధం అవుతున్నది!"

రోజీకి నోరు పెగలటంలేదు. ఎంత ఊపులో ఆ భాగంలో కాలుపెట్టిందో, అంతగా నీరసపడిపోతోంది ఆమె మాట్లాడుతున్న తీరుకు.

"నేనూ, మా ఆయనా ఒక గూటిలో అరవై సంవత్సరాలగా తనువులు వేరైనా, మనస్సులు ఒకటే అన్నట్లుగా జీవిస్తున్నాం... మా మధ్య బేదాభిప్రాయాలు రావని కాదు... రావటం సహజం... అలా వచ్చినప్పుడు కొద్ది క్షణాలు ఇద్దరమూ కళ్ళు మూసుకొని, వివాహమప్పుడు చేసుకున్న ప్రమాణాలను గుర్తుకు తెచ్చుకుంటాం... దాంతో పట్టిన మబ్బులు విడిపోతాయి... మళ్ళా హాయిగా నవ్వేసుకుంటాం!"

"మరి... మరి... పొద్దున లేచినప్పటినుంచీ ఆయన మిమ్మల్ని అరుస్తునే వుంటారు గదా!" మాట తడబడుతున్నది రోజీకి.

"నాకు కాస్తంత తలనొప్పి వస్తే ఎన్ని సేవలు చేస్తారో... ఎంత హడావుడి చేస్తారో నీకు తెలుసా... మీ ఊహకే అందదు... ఆయన మాటలే మీకు వినబడతయి... ఆయన చేతలు నాకు తప్ప మరెవ్వరికీ కనబడవ్... మీ మనస్సులు అంతగా కలుషితమవ్వటానికి కారణం మీరు సంపాదిస్తున్న డబ్బు... మన సంస్కృతీ, సంప్రదాయాలకు తిలోదకాలివ్వటానికీ మీ చేతుల్లో ఎగిరెగిరి పడుతున్న డబ్బే మూల కారణం అంటాను ... డబ్బున్న అహంతో ఎవరు ఎవరి మాట వినకపోయినా ముందు మీకు కనబడేది విడాకుల కాగితాలయితే, మాకు మాత్రం వినబడేవి వివాహ సమయంలో బ్రహ్మగారు ఉచ్ఛరించిన పవిత్రమైన ఆ మంత్రాలే..." అన్నది దమయంతి తన బోసినోటినంతా తెరిచి నవ్వుతూ...

మరు క్షణంలోనే రోజీ కళ్ళమూసుకున్నది... మనస్సంతా తెలియని అలజడితో నిండిపోగా...

(జాగృతి:దీపావళి ప్రత్యేక సంచిక: 2009)